
# భయం

పులిపాక శ్రీరామచంద్రమూర్తి



**కామేశ్వరికి** చాలా భయాలున్నాయి.

ఉదయం లేవగానే పని మనిషి వస్తుందో, రాదోనని భయపడుతుంది. పాల మనిషి వస్తుందో, రాదో నని కూడా భయపడుతుంది. తర్వాత వంట చేయగలనా సమయానికి, పిల్లల్ని స్కూలుకి పంపగలనా, భర్తని ఆఫీసుకు పంపగలనా అని భయపడటంతో ఉదయం భయాలు తీరిపోతాయి.

మధ్యాహ్నం రకరకాలుగా భయపడుతుంది కలగాపులగంగా.

రేపటికి కూరగాయలు లేవు. ఈ నెల జీతం సరిపోదేమో? ఎవరైనా బంధువులు హఠాత్తుగా కట్టగట్టుకుని వూడిపడతారేమో. పెద్ద భయం ... పండ గొస్తోంది ... పిల్లలకి, తనకీ బట్టలు ... వచ్చే ఆదివారం హాలుదాకా వెళ్ళాక టిక్కెట్లు అందుతాయో, లేదో నని భయం.

ఎప్పటికో అయిపోయే సీరియల్‌లో హీరో హీరోయిన్‌ని పెళ్ళాడతాడా, లేదా అనే భయం మధ్యాహ్నం వారపత్రిక పట్టుకోగానే పుడుతుంది.

కామేశ్వరి భర్త పీతాంబరం. అతనో చిట్ ఫండ్ కంపెనీలో పనిచేస్తాడు. మరీ కొత్త భయం భర్త పేకాట ఆడుతున్నట్టు తెలియటం. సాధారణమైన భయాలు అనేకం. అందులో ఇంట్లో వరుకులూ, పక్కింటి వాళ్ళు పట్టుకెళ్ళిన అప్పులూ ఉంటాయి. ఇవన్నీ జనరల్ భయాలు. అంటే ఆవిణ్ణి బాధ పెట్టవు.

పీతాంబరం అప్పుడెప్పుడో ఆమె దాచుకున్న డబ్బు తీసుకున్నాడు. మొన్ననే ఆమె పద్దుంటున్న ఫ్రెండుకు పాతిక రూపాయలు అప్పుగా ఇచ్చాడు. ఇవి బాధించే భయాలు.

ఇక అనవసరమైన భయాలు.

ఒంటరిగా బస్‌స్టాండులో నిలబడ్డం, బస్ వస్తుందో రాదో, వచ్చినా ఎక్కగలనో, లేదో. ఈ సారి కాన్పుకి తన పుట్టింటి వాళ్ళు పిలుస్తారో లేదో ననే భయం లేదుగాని, కొత్త చీరె పెడతారో పెట్టరో నని మాత్రం భయపడుతుంది.

అవసరమైన భయం ఏమిటంటే—ఇంటి వోనరు రెండు నెలల్నించి ఏమీ అనడం లేదు అద్దె ఇవ్వకపోయినా. మూడో నెల కూడా వూరుకుంటాడా లేదో నని భయం. జీతం వచ్చాక పీతాంబరం కామేశ్వరి కిచ్చే డబ్బు క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నాడు.

ఆమెకి ఒక్క విషయంలో మాత్రం భయం లేదు. పీతాంబర మంటేనే భయంలేదు. కాపురాని కొచ్చిన కొత్తలో భయపడేది కాని, అలా భయపడ్డం అనవసరమని తేల్చుకుంది ఈ ఏడేళ్ళ కాలంలో.

ప్రతిపక్షంలా రోజూ కొత్త డిమాండ్లతో వచ్చే కొడుకులంటే ఆవిడకి మధురమైన భయం. సాయంత్రం వేళ ఏ వీధిలో ఆడుకుంటూ తగాదా తెస్తారనేది కోపంతో కూడిన భయం. మొన్న తను టైలర్ కిచ్చిన జాకెట్లు త్వరగా ఇస్తాడో లేదో ననేది ఆరాటంతో కూడిన భయం.

ఇక విసుగుతో కూడిన భయాలు రెండు. మొదటిది మార్వాడీ దగ్గర కెళ్ళిన తన ఒంటిపేట గొలుసు. పాలు లేనప్పుడు ఫ్రెండ్స్‌తో వచ్చి బైట కూర్చుని 'కాఫీ' అని అరిచే పీతాంబరం.

నెలాఖరు రోజుల్లో వచ్చే మావగారి తద్దిన మంటే ప్రతి ఏడూ రెన్యూ అయ్యే భయమే.

ఆమె ఇలాంటి భయాల మధ్యనే పుట్టింది, పెరిగింది, జీవిస్తోంది.

వాళ్ళు అద్దె కుంటున్న ఇల్లు — కాదు — గదులు రెండింటిలో ఒకటి పెద్దది. దాని వెనకాల చిన్నగది. అది కిచెన్ ప్లస్ స్టోర్ రూమ్. చుట్టాలొస్తే బెడ్ రూమ్ 'చలికాలంలో'. ముందు జాగాలో కొంచెం ఆవరణా. అప్పటికీ ఆ జాగాలో బంతి పూలు పూయిస్తుంది. కూరగాయలు పండించా లనుకుంటుంది కాని, అవి నీళ్ళు తాగడం తప్ప కాయలివ్వడం లేదు. వీధి తలుపు తీసినా ఒకటే, వేసినా ఒకటే. దానికి గడియ లేదు. పీతాంబరం రాత్రి పూట దానికో పెద్ద చెక్క అడ్డు పెడతాడు.

నిజానికి ఇన్ని భయా లున్నాయని

చెప్పినా, ఇవన్నీ పాతవే. అయినా ఎప్పటి కప్పుడు కొత్తవే.

ఇంటి కిటికీ చువ్వకూ, వీధి గోడకు మధ్య కట్టిన నైలాన్ తాడు మీద తడి బట్టలు ఆరేస్తుంది. లోపల వంట చేస్తూ ఉంటుంది. అప్పటికి పీతాంబరం, పిల్లలూ వెళ్ళిపోతారు.

అలాగే ఆ రోజు కూడా బట్టలుతికి ఆరేసి, వంటలో పానుతూ కూర్చుంది కామేశ్వరి. దొంగల బాధ ఎక్కువగా ఉండడంతో, ఆమె చాలా జాగ్రత్తగా చూస్తోంది బట్టల వైపు.

అలాగే ఒకసారి బైటికొచ్చి చూసింది ఎదురుగా చూసిన దృశ్యం ఆమెలో భయాన్ని ఎక్కువచేసింది. అదే కళ్ళలో ప్రతిఫలించింది.

గోడ పక్కనే కూర్చుని అన్నం తింటున్నారు ఇద్దరు కుర్రాళ్ళు. అందులో ఒకడికి పన్నాలుగేళ్ళుంటాయి. రెండో వాడికి పన్నెండు. ఇద్దరూ అన్న దమ్ముల్లా లేరు. ఫ్రెండ్సులానూ లేరు. కాలం కలిపిన సన్నని దారాల్లా ఉన్నారు.

తలొంచుకొని తింటున్నారు వాళ్ళిద్దరూ.

వాళ్ళ పక్కనే ఇటుకరాళ్ళు పడేసి ఉన్నాయి. అవి అలా రెండు నెలల్నించి ఉంటున్నాయి. గోడ రిపేరుకోసం ఇంటి ఓనరు తెప్పించి పెట్టాడక్కడ. ఇటుక లొచ్చేశాక పీతాంబరం మళ్ళీ రిపేరు గురించి అడగలేదు. అది ఓనరుగారి టెక్నిక్.

పెద్దవాడి చేతిలో సత్తు కారియర్ ఉంది. ఆ కారియర్ మూతలో అన్నం, పచ్చడీ ఉన్నాయి. రెండో వాడు విస్తట్లో తింటున్నాడు. వాళ్ళిద్దరూ మహాపరాధం చేస్తున్నట్టు గబగబా తింటున్నారు.

కామేశ్వరి ఇద్దర్నీ పరీక్షగాచూసింది.

పెద్దవాడి షర్టు చాలా పెద్దదిగా ఉంది. లూజుగా వేలాడుతోంది వాడి శరీరం మీద. ఖాకీ నిక్కరు రకరకాల రంగులతో మురికిగా ఉంది. రెండోవాడు బాగా నలిగిన ఒకప్పటి తెల్ల చొక్కా వేసుకున్నాడు. మధ్య మధ్యలో లేచి తన గళ్ళ నిక్కరు పైకి లాక్కుంటున్నాడు. దాని కన్నీ చిరుగులే—కుట్టడానిక్కూడా వీల్లేకుండా. వాడు చాలా బలహీనంగా ఉన్నాడు. కళ్ళలో పుసులు. ముక్కు కారుతోంది.

ఎరుపు రంగుకు మారిన జుట్టూ, కాళ్ళనిండా దుమ్మూ, కళ్ళనిండా ఆకలి —ఇద్దరికీ సమానంగా ఉన్నాయి. అంత ర్జాతీయ బాలల వత్సరం వాళ్ళకి తెలీ కుండానే వచ్చి, తెలీకుండానే వెళ్ళి పోయింది.

రకరకాల అన్నం, కూరలూ, పచ్చళ్ళు, ఉన్నాయి విస్తట్లో, సత్తు కారియర్ మూతలో. వాటిలో సగం పెట్టినవి వాళ్ళకి పనికిరానివే. అందుకే పెట్టా రేమో. దీన్నే అన్న దానం అనుకుంటారు ఔదార్యత. పుణ్యం ఫీలింగు పోయి అనవసర మైనవీ, పనికి రానివీ వదిలించుకోవడమే దానమైంది కొందరికి.

''ఎక్కడా చోటు దొరకలేదా పాపం, ఇక్కడ కూర్చున్నారు?'' అంది కామే శ్వరి.

వాళ్ళిద్దరూ ఆ మాటలకు ఉలికిపు పడ్డారు.

''అన్నం తిని ఎళ్ళాతాం అండి'' అన్నాడు పెద్దవాడు వినయంగా, అపాలజెటిగా. రెండోవాడు అవునన్నట్టు తలూపాడు తినడం ఆపకుండానే.

కామేశ్వరి బట్టల వైపు చూసింది. ఆటంబాంబు కచ్చితంగా వాళ్ళింటిమీదే పడింది. పీతాంబరం ఎర్రచొక్కా కన్పిం చడం లేదు. పోయింది పోయింది. వాళ్ళి ద్దర్నీ జాగ్రత్తగా చూసింది. వెంటనే ఏదో మాట అనడం కూడా ఆవిడకి భయమే.

షర్టుమాత్రం పోయింది. 'ఈ ఎర్ర చొక్కా మీకేం బాగా లేదు' అని కూడా అంది పీతాంబరంతో. అదే ఇప్పుడు పోయిందనే సరికి దాని మీద ఎనలేని ప్రేమ పుట్టింది కామేశ్వరికి. అదే ఆలోచిస్తుంది లోలోపల. ముందు వీళ్ళిద్దరూ వెళితేచాలు. ఒంటరి ఆడ దాన్నని ఏదైనా చేస్తే. షర్టు పోతే పోయింది. వెళ్ళగొట్టాలి అనుకుంది మనస్సులో.

''ఇన్ని ఇళ్ళుండగా ఇక్కడికే రావాలా! వెళ్ళండి వెళ్ళండీ.'' కసిరింది.

''తిని వెళ్ళిపోతామండి.'' పెద్దవాడే అన్నాడు మళ్ళీ. వెళ్ళిపోదామా అన్నట్టు చూశాడు రెండో వాడు బెదురుగా, పెద్దవాడి కీ విషయంలో చాలా అను భవం ఉన్నట్టుంది, ఆతను కదల్లేదు కూర్చున్న చోటునించి.

''అదేవిటీ! ఆ మెతుకుల్లా అవీ నానా కంగాళీ చేస్తున్నారు. వెధవసంత వెళ్ళండి.'' అరిచింది.

వాళ్ళిద్దరూ మాట్లాడ కుండా తప స్సులో ఉన్న మునుల్లా తింటున్నారు.

షర్టు పోయింది ... అదే పీకుతోంది మనస్సులో. లోపల కూర మాడుతోంది. లోపలికి వెళ్ళింది. వెళ్తూ హేంగర్‌కి తగిలించిన ఎర్ర చొక్కా చూసింది లోపల. హమ్మయ్య ... ఉంది ... రెడ్ షర్ట్ ఉంది ... అంటే తను ఉతకలేదన్న మాట. వెధవ కంగారూ, తనూను...




**చేతి పనిని ఒకదానిని నేర్చుకొనుము రేడియో అండ్ టెలివిషన్ శిక్షణ**

మవుఖికముగాను, తపాలుద్వారాను అన్ని రకములైన రేడియో, టెలివిషన్. టేప్ రికార్డర్, ఆంప్లిఫయరులను మంచి పద్ధతిలో మరమ్మతు చేయుటకును, కూర్చుటకును శిక్షణ ఇచ్చుచున్నాము.

ఏర్ కండిషనర్ అండ్ రెఫ్రిజిరేటరు.

శిక్షణ : మవుఖికముగాను, తపాలు ద్వారాను అన్ని రకములైన ఏర్ కండిషనర్, రెఫ్రిజిరేటరు, వాటరు కూలర్, డీఫ్రీసర్, కాంబినేషన్ కూలర్, పేకేజి యూనిట్ సెంట్రల్ ప్లాంట్, సేఫ్టీ ఐస్‌క్రీం మొదలగు మిషన్‌లను మరమ్మతు చేయుటకు శిక్షణ ఇచ్చుచున్నాము.

మోటారు రీ వైండింగ్ అండ్ హవుస్ వైరింగ్ శిక్షణ.

అన్ని రకములైన టేబిల్‌ఫ్యాన్, సీలింగ్ ఫేన్, సింగిల్ పేస్, 3పేస్ మోటారులను అన్యుల సహాయము లేక వైండింగ్ చేసి యంత్రింప జేయుటకును, ఆటోమేటిక్ స్టార్‌టర్, సెమి ఆటోమేటిక్ స్టార్టర్, రివర్స్ టైప్ స్టార్టర్, స్లిప్‌రింగ్ స్టార్టర్ లాంటి ఎలక్ట్రిక్ పరికరములను మరమ్మతు చేయుటకును, ట్రాన్స్‌ఫార్మర్ వైండింగ్ చోక్ వైండింగ్ నేర్పించుచున్నాము. హవుస్ అంత్ వైరింగ్ కోర్సు ఉన్నది. తపాలు ద్వారాను నేర్చుకొనవచ్చును. వెల్డర్, ఫిట్టర్, టర్నర్, కార్ మెకానిక్, ప్లంబర్, కార్‌పెంటర్, టైలరింగ్ మొదలగు కోర్సులును, హాస్టల్ వసతి కూడా ఉన్నది.

వివరములకు 35 పైసల స్టాంపు పంపవలెను.

**ప్రిన్సిపాలు వి. గోవిందస్వామి**

రచించిన టెక్నికల్ పుస్తకములు

1. రేడియో మెకానిజం అండ్ రిపేరింగ్ (తమిళనాడు సర్కారు వారిచే బహుమతి పొందినది)
2. ట్రాన్సిస్టరు మెకానిజం అండ్ రిపేరింగ్.
3. టెలివిషన్ మెకానిజం అండ్ రిపేరింగ్.
4. ఆంప్లిఫయరు మెకానిజం అండ్ రిపేరింగ్.
5. రెఫ్రిజిరేషన్, ఏర్ కండిషనర్ మెకానిజం అండ్ రిపేరింగ్.
6. మోటారు రీ వైండింగ్.
7. టేప్ రికార్డర్ మెకానిజం అండ్ రిపేరింగ్.

పై పుస్తకములను చదివి అన్యుల సహాయము లేక రిపేరులను సరి చేయవచ్చును. ధర వివరములకు వ్రాయుము.

వి. పి. పి. లేదు.

**GEMINI INSTITUTE OF ENGINEERING TECHNOLOGY,**

**13, UMPHERSON STREET, MADRAS-600 001.**

కూర కదిలించి మళ్ళీ బైటికొచ్చింది.

క్షణాల్లో కొత్త భయం పుట్టింది కామేశ్వరి మనస్సులో.

ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు ఈ కాలంలో. కిటికీలోంచి లోపలి బట్టలు అందుతాయి. మొన్నెవరో ఇలాగే వచ్చి టేబులు క్లాతూ, బట్టలూ, ట్రాన్సిస్టరూ పట్టుకెళ్ళార్ట. ఆ వెధవలు వీళ్ళేనేమో? ఎందుకైనా మంచిది త్వరగా పంపించెయ్యాలి అనుకుంటూ గుమ్మంలోకి వచ్చింది.

మరి పనికి రాని అన్నాన్ని పక్కనే పెట్టాడు పెద్దవాడు. మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో అదే కారియర్ మూత లోంచి తీసి తిన్నాడు.

వాళ్ళిద్దరూ అన్నం తినడం పూర్తి అయింది.

"కొంచెం అన్నం పెట్టండి అమ్మగారూ!" అన్నాడు పెద్దవాడు చెయ్యి నాక్కుంటూ.

రెండో వాడు విస్తరిని కడిగినట్టు చేస్తున్నాడు. కామేశ్వరి అప్పుడెప్పుడో చూసిన యాక్సిడెంట్‌కి కళ్ళు తిరిగి పడిపోయింది. మళ్ళీ అదే స్థితికి వచ్చింది ఇప్పుడుకూడా.

"తిన్నారుగా ఇంకెందుకు?" అంది కామేశ్వరి.

"ఇది సాల్లేదండి. ఆడికి కొంచెక్రే దొరికింది. కొంచెం పెట్టించండి అమ్మగారూ!"

"అన్నం లేదు. కిలో మూడ్రూపాయలు పెట్టి కొని అన్నం పెట్టనా! వెళ్ళండి."

హఠాత్తుగా పెద్దవాడు హర్యానా లెజిస్లేటర్ అయిపోయాడు.

"కాసిని మంచినీళ్ళు ఇవ్వండి."

"మంచినీళ్ళు కాదు. కూల్ డ్రింక్ ఇస్తాను. పొద్దున కుళాయి అరగంటే తగలడింది." ఆమె ఏదీ ఇవ్వదని వాడికి అర్థమైపోయింది. అందుకే అడిగాడు వాడు.

"అన్నం తింటేనే అరిగి పోతుం దేవిటి మీ చోటు?"

"అరుగుతుందో కరుగుతుం దో మీకనవసరం. వద్దన్నాక వెళ్ళి పోవాలి మనుషులైతే."

"మంచినీళ్ళు పొయ్యండి వెళతాం" అన్నాడు వాడు.

"ఒక్క చుక్కకూడా పొయ్యను."

"రెండు గ్లాసుల నీళ్ళుకూడా లేవేంటండీ?"

"వాదన అనవసరం. బయట బోరింగ్ పంపుంది. వెళ్ళి తాగండి. ఇలా మాటల్లో పెట్టి ఏదో ఒకటి పట్టుకెళతారు" అంది కామేశ్వరి కోపంగా.

"మే వేం దొంగలం కాదు" అన్నాడు రెండో వాడు—మొదటిసారి మాట్లాడుతూ.

"అవతల నాకు పని కాలేదు. ఇంకా పూజ చేసుకోవాలి. వంట కాలేదింత వరకూ. మీ క్కాదూ చెబుతుంది అంది బిగ్గరగా.

ఇద్దరూ లేచి నిలబడ్డారు.

"వెళతాం లెండి. మంచి నీళ్ళకే ఇంత ఇదై పోతున్నారు."

"ఇప్పుడిదంతా శుభ్రం చేసుకోవాలి. ఇదో పని నాకు మళ్ళీ. మొన్న ఎవరో ఇలాగే వచ్చి టేబులు క్లాతూ, బట్టలు పట్టుకెళ్ళారట."

మనసులో మాట అంది కామేశ్వరి.

పెద్దవాడు విచిత్రంగా నవ్వాడు.

అలాంటి మాటలు అత నెన్నిసార్లో విన్నట్టు. ఒసారి ఆమెనీ, ఆ ఇంటినీ చూశాడు. బయటికి నడుస్తూ అన్నాడు.

"మేం వెళుతున్నాం లెండి. మీ కళ్ళకి అందరూ దొంగల్లాగానే కనపడతారు." ఇద్దరూ బయటికి వెళ్ళారు.

కామేశ్వరి సంతోషంగా వూపిరి పీల్చుకుంది. వీధి మలుపు దగ్గర కేసి, పెద్ద చెక్క అడ్డం పెట్టింది. తొందర తొందరగా లోపలికి వెళ్ళింది.

"కూర తగలడింది" అనుకుంటూ దించింది.

స్నానం చేసి, దేవుడి పటం ముందు కూర్చుంది. తాగని దేవుడికి తీర్థం ఇచ్చి ంది. తినని దేవుడికి నైవేద్యం పెట్టింది.

అగరొత్తులు వెలిగించింది. తనకి చేతనైనంతలో సకలోప చారాలూ చేసింది.

ఇందాకటి కుర్రాళ్ళు ఆమెకి గుర్తు లేరు. సహాయమూ, ఆదరణ తోటి మానవుల పట్ల అవసరమని కూడా ఆమెకి తెలీదు. ఇలాంటి విషయాలో ఆమెకి తెలిసే అవకాశమే లేదు.

పూజ అయిపోయింది.

మళ్ళీ భయం పట్టుకుంది కామేశ్వరికి బట్టలన్నీ బయటే ఉన్నాయి. లేచి వెళ్ళింది గబగబా.

వాకిట్లో గుమ్మం పట్టుకుని అలాగే నిలబడిపోయింది కామేశ్వరి.

ఆ కుర్రాళ్ళిద్దరూ వదిలి వెళ్ళిన సత్తు కారియర్ మూత ఇటుకల గుట్ట మీద ఉంది. ఆ మూతలోని అన్నం మెతుకుల్ని తింటున్న రెండు కాకులు కామేశ్వరిని చూసి, చప్పున పైకి ఎగిరాయి. ★

GLADSTONE

వాటర్ ఫిల్టర్స్

పరిశుభ్రమైన నీటికి మంచి విధానం




ఆరోగ్యం ఎల్ల అశ్రద్ధ వహించకండి. పరిశుభ్రమైన, సురక్షితమైన త్రాగే నీటి కోసం గ్లాడ్‌స్టోన్ వాటర్ ఫిల్టర్స్‌ను నమ్మండి. అల్యూమినియమ్‌లోనే కాక పోలీప్రొపిలిన్ రకాలలో కూడా లభిస్తున్నాయి. ప్రత్యేకంగా ఉన్నతింప బడిన సిరామిక్ క్యాండిల్ నీటిలో కలిగియున్న అతి సూక్ష్మమైన మలినములను నశింపజేయడమే కాక—కెమికల్ రియాక్షన్స్‌కు విరుద్ధముగాను సురక్షితంగాను రెండూను పనిచేస్తాయి.

ఎపోక్సీ కోటెడ్ అల్యూమినియమ్ బోడీగలవి 12, 20 మరియు 30 లీటర్ల క్యపాసిటీలలో లభిస్తున్నాయి. పోలీప్రొపిలిన్ 15 మరియు 30 లీటర్ల సైజులలో లభిస్తున్నాయి.

గ్లాడ్‌స్టోన్ వారి మిగతా ఉత్తమమైన తయారీలలా ఇవి సర్వదా మన్నేలా తయారు చేయబడినాయి.

మీ ఇంటికి ఉపయోగపడే సామగ్రిలన్నీనూ...ఒకే దగ్గర లభిస్తున్నాయి.



GLADSTONE జీవిత కాలపు మన్నికలో ఒక నాణ్యత

గ్లాడ్‌స్టోన్ లాయల్ అండ్ కం. లిమిటెడ్, కలకత్తా-700 016

React-C/GL-10 Tel/82